1St Happy Work Anniversary. 1 Year

షణ్ముఖ SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152





Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 49 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 19 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 49 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Thursday 19 February 2026 PAGES : 8 PRICE : 3/-


## అమెరికాతో ట్రేడ్ డీల్.. రష్యా చమురు దిగుమతుల్లో భారీగా కోత..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 18)
రష్యా నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులు గణ నీయంగా తగ్గాయి. ఈ ఏడాది జనవరిలో 40 శాతానికి పడిపోయాయి. ఇందులో రష్యా ముడి చమురుకు భారీ కోత పడింది. భారత్‌లోని శుద్ధి కర్మాగారాలు రష్యా ముడి చమురు కొనుగోళ్లను భారీగా తగ్గించడంతో ఈ పరిణామాలు జరిగినట్లు తెలుస్తోంది. గతేడాది జనవరిలో 4.81 బిలియన్ డాలర్ల వస్తువులను భారత్ రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది అది 2.86 బిలియన్ డాలర్లకే పరిమితమైంది. 2022 నుంచి భారీ తగ్గింపు ధరతో ముడిచమురు దిగుమతులను రష్యా ఆఫర్ చేసింది. అప్పటి నుంచి భారత్‌లో ఈ దిగుమతులు గణనీయంగా పెరిగాయి. అయితే, రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షల ఒత్తిడి పెరగడం, యూఎస్‌తో వాణిజ్య చర్చలు కొనసాగుతున్న క్రమంలో ఇటీవలి కాలంలో ఈ కొనుగోళ్లు మందగించినట్లుగా తెలుస్తోంది. కాగా.. ఇటీవల భారత్–అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇందులో రష్యా ముడి చమురు కొనుగోలుపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. మాస్కో చమురు దిగుమతి చేసుకోమని భారత్ తమకు హామీ ఇచ్చిందని అగ్రరాజ్యం ప్రకటించింది. దీనిపై భారత్ స్పందిస్తూ.. దేశీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

## బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు

తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై మండలిలో చర్చకు పట్టుబట్టిన వైసీపీ
వైసీపీ తీర్మానాలను డిస్మిస్ చేసిన మోషేన్ రాజు
అసెంబ్లీలో చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారన్న బొత్స



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 18)
ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారంపై చర్చకు వైసీపీ మళ్లీ పట్టుబడుతోంది. నిన్న ఈ విషయమై వైసీపీ తీర్మానం ఇవ్వగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. నేడు కూడా అదే సీన్ రిపీట్ అయింది. ఇందాపూర్, హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చకు తీర్మానాన్ని ఇవ్వగా మోషేన్ రాజు డిస్మిస్ చేశారు.దీంతో మండలి విపక్ష నేత, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ -మిగతా 2లో

## నా దుడ్లతోనే మ్యాచ్ చూస్తిని.. నీవేమైనా ఇచ్చావా జగన్?: నారా లోకేశ్

- కొలంబోలో జరిగిన భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ కు హాజరైన మంత్రి
- ప్రభుత్వ సొమ్ముతో కొలంబో వెళ్లారన్న ప్రచారాన్ని ఖండించిన లోకేశ్
- పుష్ప స్టైల్లో ఎక్స్ వేదికగా వైసీపీకి మంత్రి కౌంటర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 18)
కొలంబోలో భారత్ -- పాక్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ కు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరైన విషయం తెలిసిందే. అయితే, ఈ పర్యటనకు మంత్రి లోకేశ్ ప్రభుత్వ నిధులు వాడారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలపై మంత్రి సెటైర్ వేశారు. పుష్ప సినిమా స్టైల్లో జవాబిచ్చారు. -మిగతా 2లో

# ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే

## మంత్రి లోకేశ్ కౌంటర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 18)
ఇటీవల కొలంబోలో జరిగిన భారత్–పాక్ మ్యాచ్‌కు తన సొంత ఖర్చుతో వెళ్లానని ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ధనం ఖర్చు చేసి వెళ్లినట్లు వైకాపా సొంత మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?" అని లోకేశ్ తనదైన శైలిలో పేర్కొన్నారు.

**బొత్స పట్టుకోల్పోయారు**

శాసన మండలిలో వైకాపా పక్ష నేత బొత్స సత్యనారాయణ ఆ పార్టీ సభ్యులపై పట్టు కోల్పోయారని నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు పరస్పర విరుద్ధంగా రెండు వాయిదా తీర్మానాలు ఇచ్చారని చెప్పారు. ఒకరు కల్తీ లడ్డూపై.. మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చ కోరుతున్నారన్నారు. వారి కొట్లాటలో ఎవరు పైచేయి సాధిస్తారోనని తమకు ఆసక్తిగా ఉందని చెప్పారు. సభలో తమ స్ట్రాటజీ ఏంటో చూస్తారుగా అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం...



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 18)
ధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి: అనిత
తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు. చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే -మిగతా 2లో

## రఫేల్‌లో 50% దేశీయ తయారీ పరికరాలు ఉండాలి

రాజ్‌నాథ్ సింగ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 18)
త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని పెంచే దిశగా ఫ్రాన్స్‌తో రఫేల్ యుద్ధ విమానాల డీల్‌ను భారత్ కుదుర్చుకోనుంది. ఈ నేపథ్యంలో రక్షణమంత్రుల స్థాయి సమావేశంలో భారత్‌లో పరికరాల తయారీకే రాజ్‌నాథ్ సింగ్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రఫేల్ ఫైటర్ జెట్‌లో 50 శాతం దేశీయ తయారీ పరికరాలు ఉండేలా చూడాలని ఫ్రాన్స్‌ను కోరారు. ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యంలో కో డిజైన్, కో డెవలప్‌మెంట్, కో ప్రొడక్షన్ వంటి అంశాలు చేర్చినట్లు తెలుస్తోంది. రూ.3.25 లక్షల కోట్ల అంచనాతో 114 రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బెంగళూరులో రక్షణ మంత్రుల స్థాయి వార్షిక సమావేశం జరిగింది. భారత్‌లో తయారీ గురించి రాజ్‌నాథ్ సింగ్ -మిగతా 2లో

## అదో తుగ్లకీయ కమిషన్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 18)
ఎన్నికల సంఘం "తుగ్లకీయ కమిషన్"లా వ్యవహరిస్తోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం ఆరోపించారు. భాజపా ఆదేశానుసారం ఓటరు జాబితాల్లో మార్పు చేర్పులు చేస్తోందని విమర్శించారు. ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకొని ప్రజల్ని ఇబ్బందుల పాలుచేసిన దిల్లీ చక్రవర్తి సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్‌లా, -మిగతా 2లో

## రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

- 94,500 మెట్రిక్ టన్నుల శనగల సేకరణకు నిర్ణయం
- రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ
- కొనుగోలు చేసిన 15 రోజుల్లోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 18)
ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు



గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవ సాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం 94,500 మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని -మిగతా 2లో

## ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 18)
అమెరికా–ఇరాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించబోదన్నారు. అంతేకాదు.. ప్రపంచంలో బలమైన సైనిక శక్తి ఉన్నవాళ్లకూ తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చన్నారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. జెనీవా వేదికగా ఇరాన్–అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

"తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. అయితే, ఒక్కోసారి అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇరాన్ దిశగా యుద్ధ నౌకలను పంపించామని ప్రకటనలు చేస్తున్నారు. ఆ నౌకలు నిజంగా ప్రమాదకరమైనవి. కానీ, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికా అంగీకరించడం శుభపరిణామం. ఎన్నటికీ ఏమీ చేయలేరు. అణు చర్చలు జరుపుదాం అంటున్నారు. కానీ, చివరకు మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని చెబుతున్నారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ధరించడం తప్పిదం, మూర్ఖత్వమే" అని ఖమేనీ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. -మిగతా 2లో

## భారత్ సాయం మాకు అత్యంత కీలకం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 18)
అంతర్జాతీయ సమాజ అభ్యున్నతి కోసం శాశ్వత ప్రాతిపదికన భారత్ అందిస్తున్న సాయం తమకెంతో కీలకమని ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ స్పష్టం చేశారు. ప్రపంచంలో ఇప్పుడు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలక పాత్రను పోషించే అత్యంత సానుకూల ధోరణి నడుస్తోందని తెలిపారు. దక్షిణార్ధ గోళ దేశాల పరిధిలో తొలిసారిగా భారత్ నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్–2026లో పాల్గొనేందుకు అమెరికాలోని న్యూయార్క్ నుంచి బయలుదేరే ముందు ఆయన పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో ఐరాస నిర్వహిస్తున్న పీస్ కీపింగ్ మిషన్లలో అత్యధికంగా 5వేల మంది భారత భద్రతా -మిగతా 2లో

## ఫ్రాన్స్‌తో భాగస్వామ్యం ఇక ప్రత్యేకం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 18)
తమ మధ్య సంబంధాలను 'ప్రత్యేక ప్రపంచవ్యాప్త వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచాలని భారత్-ఫ్రాన్స్ నిర్ణయించాయి. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ కల్లోల పరిస్థితుల్లో రక్షణ, వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఉన్నత సాంకేతికత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని గణనీయంగా పెంచుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రతినబూనారు. మోదీ ఆహ్వానం మేరకు మూడురోజుల పర్యటన నిమిత్తం మెక్రాన్ ముంబయి చేరుకున్నారు. మెక్రాన్‌ను మోదీ సాదరంగా స్వాగతించారు. లోక్‌భవన్‌లో ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడం, సరికొత్త రంగాలకు వాటిని విస్తరించడం, భాగస్వామ్యంలో పురోగతిపై సమాలోచనలు జరిపారు. ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త -మిగతా 2లో

# రఫేల్‌లో 50% దేశీయ తయారీ పరికరాలు ఉండాలి

చర్చించారు. ఈ డీల్‌లో ఎక్కువగా మేక్‌ఇన్ ఇండియా పరికరాలు ఉండాలని, భారతీయ కంపెనీలకు సాంకేతికత బదిలీ వంటి అంశాలపై మాట్లాడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తదుపరి తరం ఫైటర్ జెట్ ఇంజిన్ తయారీ విషయంలో సాంకేతిక సహకారం కోసం చర్చించినట్లు తెలిపాయి.

# భారత్ సాయం మాకు అత్యంత కీలకం

సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఇందుకోసం భారత్‌కు ఐరాస సదా రుణపడి ఉంటుందని చెప్పారు. 2007లో లైబీరియాలో పీస్ కీపింగ్ మిషన్ కోసం పూర్తిగా మహిళలతో కూడిన తొలి పోలీస్ యూనిట్‌ను అందించిన ఘనత భారత్‌కే దక్కుతుందని తెలిపారు. జీ20 సదస్సును భారత్ నిర్వహించిన సమయంలోనే పలు విప్లవాత్మక నిర్ణయాలను తీసుకున్నారని గుర్తు చేశారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత్ చేయూత**

'ఒక బాధ్యతాయుత ప్రజాస్వామిక దేశంగా, ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత్ చేయూత అందిస్తోంది. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మెజారిటీ వాటాను కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యధిక వాటాను భారత ఆర్థిక వ్యవస్థే కలిగి ఉంది' అని గుటెరెస్ వ్యాఖ్యానించారు.

**భద్రతా మండలి వైఫల్యంవల్లే ఐరాసపై విమర్శలు**

'ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు సంక్షోభాలు, అన్యాయాలు, అసమానతలు, పేదరికం, ఆకలి పెరుగుతున్నాయి. చాలా దేశాల్లో ఉగ్రవాద భూతం వేళ్లూనుకుంటోంది. ఈ నేపథ్యంలో యావత్ ప్రపంచం ఐక్యరాజ్య సమితివైపు చూస్తోంది. అయితే ఐరాస అంటే కేవలం భద్రతా మండలి ఒక్కటే కాదు. 193 దేశాలకు ప్రాతినిధ్యం ఉంది. వీటికి సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. కానీ.. భద్రతా మండలి కొన్ని దేశాలకే పరిమితం అయినందువల్లే ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో అది సరైన నిర్ణయాలను తీసుకోలేకపోతోంది. కేవలం భద్రతా మండలి వైఫల్యం కారణంగానే ఐరాస విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది' అని ఆంటోనియో వ్యాఖ్యానించారు.

**భారత రాష్ట్రపతి, ప్రధానితో భేటీ**

దిల్లీ వేదికగా జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమిట్‌-2026' వస్తున్న గుటెరెస్.. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలతో భేటీ కానున్నారు. సదస్సులో పాల్గొనే అంతర్జాతీయ టెక్ కంపెనీల ప్రముఖులతోనూ ఆయన సమావేశమవుతారు. ఐరాస ఏర్పాటు చేసిన 'ఇంటర్నేషనల్ సైంటిఫిక్ ప్యానల్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సభ్యులతో దిల్లీలో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ ఐరాస విభాగంలో ఉన్న 40 మంది టెక్ నిపుణుల్లో ఐఐటీ మద్రాస్‌కు చెందిన బాలరామన్ రవీంద్రన్‌కు చోటు లభించింది.

# ఫ్రాన్స్‌తో భాగస్వామ్యం ఇక ప్రత్యేకం

ప్రాధాన్యమున్న అంశాలపై చర్చించారు. 21 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌లో హేమర్ క్షిపణుల ఉత్పత్తికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, సాఫ్రాన్ (ఫ్రాన్స్) మధ్య కుదిరిన ఒప్పందం దీనిలో ఒకటి. ఇరు దేశాల సైన్యాల మధ్య అధికారులను పరస్పరం నియుక్తం చేయడం మరొకటి. చర్చల అనంతరం మోదీ తరఫున ఒక ప్రకటన విడుదలయింది. ముంబయిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో బాలీవుడ్ నటులు మనోజ్ బాజ్‌పాయ్, రిచా చద్దా, అనిల్ కపూర్ తదితరులు.

**ఎవరెస్టుపైనా ఎగరగలిగే హెలికాప్టర్ల ఉత్పత్తి**

"భారత్‌-ఫ్రాన్స్‌ల మధ్య ఎంతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. మనకు ఎంతోకాలంగా వ్యూహాత్మక భాగస్వామిగా ఉన్న దేశాల్లో ఫ్రాన్స్ ఒకటి. మెక్రాన్‌తో కలిసి ఈ భాగస్వామ్యాన్ని మునుపెన్నడూ లేనంత బలోపేతం చేసుకుంటున్నాం. విశ్వాసం, దార్శనికతల ప్రాతిపదికన దీనిని ప్రత్యేక స్థాయికి తీసుకువెళ్తున్నాం. ఎవరెస్ట్ పర్వత శిఖరంపైనా ఎగరగలిగే సత్తా

## మొదటిపేజీ తరువాయి

ఉన్న హెలికాప్టర్ల తయారీని రెండు దేశాలూ కలిసి కర్ణాటకలో చేపట్టాయి. ఇలాంటిది ప్రపంచంలో మరొకటి లేదు. వీటిని ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తాం. భారత్‌-ఐరోపా సంబంధాల్లో 2026 సంవత్సరం కీలక మలుపుగా నిలుస్తుంది. కొద్దిరోజుల క్రితమే ఈయూతో చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. అంతటా అనిశ్చితి అలముకున్న వేళ ఫ్రాన్స్‌తో కుదిరిన బంధం.. ప్రపంచ సుస్థిరతకు ప్రబల శక్తిగా నిలుస్తుంది" అని భారత ప్రధాని పేర్కొన్నారు. తమకు అత్యంత విశ్వసనీయ భాగస్వాముల్లో భారత్ ఒకటని మెక్రాన్ వ్యాఖ్యానించారు. రఫేల్ యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు రక్షణరంగంలో సహకారాన్ని రెండు దేశాలూ విస్తరించుకుంటున్నాయని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులోనూ సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. కర్ణాటకలోని వేమగల్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లింగ్ యూనిట్‌ను ఇద్దరూ కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. 'భారత్‌-ఫ్రాన్స్ నవకల్పన ఏడాది'ని కూడా ప్రారంభించారు.

**రక్షణ ఒప్పందం పునరుద్ధరణ!**

ఈనాడు, బెంగళూరు: ఫ్రాన్స్‌తో భారత రక్షణ ఒప్పందాన్ని పదేళ్లకు పునరుద్ధరించేలా రెండు దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. మంగళవారం బెంగళూరులో నిర్వహించిన ఇరు దేశాల ఆరో ద్వైపాక్షిక రక్షణ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ రక్షణ మంత్రి కేథరిన్ వోట్రిన్, ఇరు దేశాల త్రివిధ దళాధిపతులు పాల్గొన్నారు. రాజ్‌నాథ్ మాట్లాడుతూ- ఫ్రాన్స్‌తో ఒప్పందం.. రక్షణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

# ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు

**మూడు గంటల్లో ముగిసిన చర్చలు..**

జెనీవా వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలు మూడు గంటల్లో ముగిశాయి. చర్చల సమయంలోనే హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ సందర్భంగా జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసింది. ఈ క్రమంలో లైవ్ క్షిపణులను ప్రయోగించడం గమనార్హం. ఆ ప్రాంతంలో అమెరికా సైన్యాన్ని మోహరిస్తున్న వేళ టెహ్రాన్ ఈ చర్యలకు ఉపక్రమించింది.

# అదో తుగ్లకీయ కమిషన్

జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్‌లా వ్యవహరిస్తూ కమిషన్ బెంగాల్ ఓటర్లను యాతనలకు గురిచేసిందని ముఖ్యమంత్రి విలేకరుల సమావేశంలో అన్నారు. ఈసీ నిబంధనల్ని ఉల్లంఘిస్తోంది, సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తోంది, అది సృష్టించిన అయోమయం కారణంగా మరణాలు కూడా సంభవించాయి అని మమత పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటరు నిర్ధారణకు ఆమోదిస్తున్న డాక్యుమెంట్లను పశ్చిమ బెంగాల్‌లో ఆమోదించడం లేదని ఆమె తెలిపారు. బెంగాల్ భారతదేశంలో భాగం కాదా అని ప్రశ్నించారు. సర్ కారణంగా తలెత్తిన మానసికాందోళన, పని ఒత్తిడి బెంగాల్‌లో 160 మరణాలకు కారణమైందన్నారు.

# రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు అందాయని, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు.

కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ వంటి అన్ని శాఖల సమన్వయంతో నేరుగా రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన 15 రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

# కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం...

మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు. దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని అనిత దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో యాడ్స్ రూపంలో సాక్షికి రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

# బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు

తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "టీటీడీలో ఇందాపూర్, హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చించాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీలో ఈ వ్యవహారంపై చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. అందుకే మండలిలో చర్చకు మేము డిమాండ్ చేస్తున్నాం" అన్నారు. బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ లాబీలో నిర్వహించిన చిట్ చాట్‌లో స్పందించారు. "శాసనమండలిలో ఉన్న వైసీపీ సభ్యులపై బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు. వైసీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు వేర్వేరుగా వాయిదా తీర్మానాలు ఇచ్చారు. ఒకరు లడ్డూ కల్తీపై చర్చించాలని, మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చించాలని అడిగారు. ఈ ఇద్దరు ఎమ్మెల్సీల్లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి" అని వ్యాఖ్యానించారు.

# నా దుడ్లతోనే మ్యాచ్ చూస్తిని.. నీవేమైనా ఇచ్చావా జగన్?: నారా లోకేశ్

భారత్‌-పాక్ క్రికెట్ మ్యాచ్‌కు తాను ప్రభుత్వ ఖర్చుతో వెళ్లలేదని, సొంత డబ్బులతోనే వెళ్లానని స్పష్టం చేస్తూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వైసీపీ అనుకూల మీడియాలో వస్తున్న వార్తలను ఖండిస్తూ లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఘాటు రిప్లై ఇచ్చారు. "ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?" అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ సొమ్ముతో విదేశీ ప్రయాణాలు చేశానన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

# వినికిడి లోపాలను చిన్నవయసులోనే గుర్తించాలి

## జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)**

వినికిడి లోపాలను చిన్న వయసులోనే గుర్తించి వైద్యం పొందటమే కాకుండా సొంత ప్రయోగాలు చెయ్యకుండా చెవి కి సమస్య వచ్చినప్పుడు వైద్యుల సలహా పాటించడం ద్వారా 90 శాతం వినికిడి సమస్యల నుంచి బయటపడవచ్చు అని, విద్యార్థి దశలో వారికీ అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో మరింత అవగాహన తీసుకురావచ్చు అని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు అన్నారు. వరల్డ్ హియరింగ్ డే ను పురస్కరించుకుని ఈఎన్‌టి విభాగం ఆధ్వర్యంలో బండ్లమిట్ట బాలికల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ ప్రభాకరరావు తెలిపారు. వరల్డ్ హియరింగ్ డే సందర్బంగా కమ్యూనిటీ లెవెల్ నుంచి స్కూల్ లెవెల్ వరకు అవగాహనా పరీక్షలు నిర్వహణ జరుగుతుంది అన్నారు. ఈ వైద్య శిభిరం కోసం అనుమతి ఇచ్చి జిల్లా విద్యా శాఖ అధికారి వారికీ అయన కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు అనుమతి ఇస్తే బండ్ల మిట్ట స్కూల్ ను దత్తత తీసుకుంటామని ప్రకటించారు. ఈ సందర్బంగా విద్యార్థినులతో ముఖా ముఖి ముచ్చటించి అవగాహ కల్పించారు. చెవి తనంతట తానే రిపేర్ చేసుకునే సౌలభ్యం కలిగి ఉంటుంది అని, చిన్న చిన్న వాటికీ బడ్స్ లాంటివి పెట్టడం లాంటి వి చెయ్యద్దు అని తెలిపారు. పుట్టకతో వినికిడి లోపం వున్నా వారిని గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలి అన్నారు. హియరింగ్ ఎయిడ్ పెట్టుకున్న వారి పట్ల సహానుభూతి కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమారి, జిజిహెచ్ వైద్యులు పి రాంబాబు, కవిత, కిరణ్, షామిని, రమ్య, క్రీస్కాంత్, శశికళ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాల పై అవగాహన ర్యాలీ

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 18)**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ రిజ్వాన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిజ్వానా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికలపై లైంగిక వేధింపులు భ్రూణ హత్యలు, లింగ వివక్ష , వంటి వాటిపై విద్యార్థులకు తెలియపరిచారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు, అంగనవాడి టీచర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.








ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
19.02.26 గురువారం


# కనిగిరి వైసీపీలో టిక్కెట్ రచ్చ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 18)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కనిగిరి రాజకీయాలు చర్చకు దారితీశాయి. కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తాను కందుకూరు నుంచి పోటీ చేస్తానని, తన కుమారుడు కనిగిరి నుంచి పోటీ చేస్తాడని ఈ విషయం పార్టీ అధిష్టానానికి కూడా చెప్పానని బిసిలలో పెద్ద నాయకుడిని అయిన తనకు కనిగిరి, కందుకూరు వైసీపీ పార్టీ టిక్కెట్లు కేటాయిస్తుందని రెండు రోజుల క్రితం జరిగిన ఓ మీడియా సమావేశంలో తెలిపారు. దాంతో కనిగిరి వైసీపీలో ఎన్నికలకు మూడేళ్ళు సమయం ఉన్నా కనిగిరిలో మాత్రం వైసీపీ టిక్కెట్ పై చర్చ నడుస్తుంది. ప్రస్తుతం కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ నాయకులను కలుపుకుని పోకుండా ఒంటెద్దుపోకడలు అవలంబిస్తున్నాడని వైసీపీ నాయకులు కొందరు విమర్శిస్తున్నారు. వైసీపీ నాయకులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, సిఎస్‌పురం ఎంపిపి మూడమంచు వెంకటేశ్వర్లు ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని దద్దాల వర్గం అధిష్టానం పై ఒత్తిడి తెస్తుంది. దాంతో దద్దాల కన్నా ఆర్థిక, అంగ బలం మాకే ఉందని బిసిలకు కేటాయిస్తే మాకు అవకాశం ఇవ్వాలని సిఎస్‌పురం ఎంపిపి వెంకటేశ్వర్లు, డాక్టర్ పెరుగు మురళీ కృష్ణలు జగన్‌ను కలిశారు. ఆ విషయం తెలుసుకున్న దద్దాల గత ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బుర్రా వల్ల వైసీపీకి వ్యతిరేకంగా పని చేశారని, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దద్దాల వర్గం గత కొద్ది నెలలుగా అధిష్టానానికి మొరపెట్టుకున్నారు. కానీ అధిష్టానం వారి పై చర్యలు తీసుకోకపోగా కనిగిరికి వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ ఆసుపత్రి కి వెళ్లడం గమనార్హం. నాయకులను సన్మానించి నేను టిక్కెట్ రేసులో ఉన్నానంటూ వారికి చెబుతున్నట్లు సమాచారం. సిఎస్‌పురం ఎంపిపి మాత్రం బెంగుళూరు, తాడేపల్లిలో జగన్‌ను కలిసి తనకు టిక్కెట్ ఇవ్వాలని పలు మార్లు



బుర్రా మాటలతో కనిగిరిలో చర్చ

మాకూ అవకాశం అంటూ జగన్‌ను కలుస్తున్న నేతలు

టిక్కెట్ ఆశిస్తున్న వారిలో


సిఎస్‌పురం ఎంపిపి, డాక్టర్ పెరుగు లు కూడా

నాకే రెండు టిక్కెట్‌లు అంటున్న బుర్రా

కోరినట్లు ఆయన అనుచరులు కోరారు. డీలిమిటేషన్ జరిగితే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అందువల్లే కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి ని మార్చలేదని బుర్రా వ్యతిరేక వర్గం అంటుంది. కనిగిరి వైసీపీ టిక్కెట్ పై యాదవ సామాజిక వర్గానికి చెందిన బుర్రా, దద్దాల, ఎంపిపి వెంకటేశ్వర్లు, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ లు ప్రయత్నాలు చేసే విషయమై ఆ పార్టీలో జోరుగువ చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా ఇటీవల కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పామూరు రోడ్డులోని తన స్థలంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, ఆయన పథకాల పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విలేకరుల సమావేశానికి ముందు తన ముఖ్య అనుచరలతో మనదే టిక్కెట్ అని ఎటువంటి అధైర్య పడాల్సిన పని లేదని చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర మాజీ రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి వచ్చే ఎన్నికల్లో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తనకు అవకాశం ఇస్తాడన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. తన సామాజికవర్గానికి చెందిన ఓటర్లు అధికమని, గత వైసీపీ పాలనలో కనిగిరిలో తన సామాజిక వర్గానికి తీవ్ర నష్టం జరగడం వలనే వైసీపీకి వ్యతిరేకంగా పని చేసినట్లు అధిష్టానానికి గణాంకాల ద్వారా వివరిస్తున్నట్లు తెలుస్తుంది. మూడు పర్యాయాలు వైసీపీ టిక్కెట్ ఒకే సామాజిక వర్గానికి కేటాయించారని, 2029లో ఓసిలకు టిక్కెట్ ఇవ్వడం ఖాయమనే చర్చ కూడా నడుస్తుంది. మాజీ ఎమ్మెల్యే బుర్రా మాటలతో కనిగిరి వైసీపీలో టిక్కెట్ చర్చ ఊపందుకోగా తాను టిక్కెట్ రేసులో ఉన్నానని మాజీ జడ్పీటిసి వైఎం ప్రసాద్‌రెడ్డి అనడం వైసీపీలో డజనుమంది దాకా టిక్కెట్లు కోరే అవకాశాలు ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది....!

## రోంపేరు వరద కాలువ పునరుద్ధరణకు రూ.26.50 కోట్లు విడుదల

మంత్రి నిమ్మల రామానాయుడికి ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 18)

బాపట్ల జిల్లాలోని రోంపేరు రైట్ ఆర్మ్ డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేపట్టేందుకు 26.50 కోట్ల నిధులు చేయడంతో బుధవారం ఎమ్మెల్యే ఏలూరి మంగళగిరిలో మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రోంపేరు పరివాహక ప్రాంతాల్లో వరదల సమయంలో వరద నీటితో పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా సిల్ట్ పేరుకుపోవడంతో డ్రెయిన్‌లో నీటి ప్రవాహం మందగించి వరద ముప్పు పెరిగి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో డ్రెడ్జింగ్ పనులు పూర్తయితే సుమారు 75 వేల ఎకరాలకు వరద ముప్పు తగ్గి రైతులకు ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించనున్నట్లు తెలిపారు. రైతు ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల పక్షాన మంత్రికి ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## 25న ముఖ్యమంత్రి వెలుగొండ పర్యటన

కలెక్టర్ రాజాబాబు వెల్లడి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 18)

దోర్నాల మండలంలో ఈ నెల 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారైనట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు వెల్లడించారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి మండలంలోని కొత్తూరు, గంజి వారిపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రాజెక్టు ఫీడర్, కెనాల్, ముఖ్యమంత్రి హెలిప్యాడ్, సభా ప్రాంగణ స్థలాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. సీఎం పర్యటన కాన్వాయ్ వెళ్లే గ్రామాల్లో రోడ్లు, విద్యుత్ లైన్లు, చెట్లు, (తరువాయి 4లో...)

## బాపట్ల తీరాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు గోవా పర్యటన

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 18)

ప్రభుత్వ దూరదృష్టి ప్రకారం బాపట్ల జిల్లా తీరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గోవా రాష్ట్రంలో అమలవుతున్న విజయవంతమైన తీర పర్యాటక నమూనాలను అధ్యయనం చేయడానికి జిల్లా స్థాయి ప్రతినిధి బృందం 19 నుంచి 22 ఫిబ్రవరి 2026 వరకు గోవాకు సాంకేతిక అవగాహన పర్యటన చేపడుతోంది. ఈ బృందానికి బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ నాయకత్వం వహిస్తున్నారు. బృందంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి, చీరాల తహసీల్దార్ కె గోపీకృష్ణ, (తరువాయి 4లో...)

## సదరం లేక లబ్ధిదారులు అవస్థలు

జిల్లా కేంద్రంలో సదరం కేంద్రం నిలుపుదల

సుదూర ప్రాంతాలకు వెళ్లలేక

ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 18)

జిల్లా కేంద్రం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీజీహెచ్)లోని సదరం కేంద్రాన్ని ఎత్తివే శారు. కేంద్రం మూతపడి ఆరు నెలలు కావస్తోంది. దీంతో మార్కాపురం ప్రాంతంలోని లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో సదరం కేంద్రాలు నిర్వహించగా, సగటున 80 నుంచి 100 మంది (తరువాయి 4లో...)

## ఖాళీ ప్లాట్లను రద్దుపరిచి నూతన లబ్ధిదారులకు అందజేయాలి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 18)



ఖాళీ ప్లాట్లను రద్దు చేసి నూతన లబ్ధిదారులకు మంజూరు చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో గత ప్రభుత్వంలో వైసిపి పాలనలో జరిగిన హౌసింగ్ లేఅవుట్లలో అసంబద్ధ కేటాయింపుల పై ప్రసంగించారు. తన నియోజకవర్గంలో నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్లు అని 14,280 హౌస్ ప్లాట్లు ఇచ్చారని, కానీ వాటిలో 6,400 లబ్ధిదారులతో మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన 7,870 ప్లాట్లు ఖాళీగా ఉంచారన్నారు. వీటిలో కనీసం ఇళ్ళు, పునాదులు కూడా కట్టలేదన్నారు. ఈ ప్లాట్లు అన్ని ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత మంత్రి ఈ ఖాళీ ప్లాట్లను రద్దుపరిచి నూతన లబ్ధిదారులకు అందజేస్తే ప్రజలకు మంచి చేకూరుతుందన్నారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు కూడా మంచి జరుగుతుందన్నారు. హౌసింగ్ మంత్రి దానికి సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వాలని శాసనసభ సాక్షిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు.

# ఉచిత మెడికల్ క్యాంప్



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 18)

ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహరెడ్డి ఆదేశాల మేరకు "ఉచిత మెడికల్ క్యాంప్" స్థానిక డివి మనోహర్ అపార్ట్మెంట్ వద్ద, వైద్య ఆరోగ్య అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు కొండిశెట్టి రమణయ్య, పట్టణ టిడిపి అధ్యక్షుడు యస్ అమీర్ బాబు, పట్టణ మాజీ సర్పంచ్ డివి మనోహర్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి యస్‌కె హాజీ గౌస్, పట్టణ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు మోబిన మౌలాలి, మండల టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు యస్ కె చిన్న హాజీమాలన్, పట్టణ ఐటిడిపి అధ్యక్షుడు పత్తు మస్తాన్, బూత్ ఇంచార్జి మొగుళ్ళూరి మధు, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ యస్‌కె రూభిన, ఏయన్‌యమ్ సమీనా, యన్ బ్రహ్మానందం, రమేష్, ఆశ వర్కర్లు రజియా, పద్మ, బి పద్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన రోగులకు వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

వీఆర్‌ఏ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని చెప్పి ధర్నా జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి పి జ్యోతి అధ్యక్షతన జరిగింది. ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. వీఆర్‌ఏలు అనేక దఫాలుగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. తెలంగాణ తరహాలో ప్లేస్ కెళ్లే వాళ్ళని నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని, ప్రమోషన్ ఇవ్వాలని, మండలాల్లో వీఆర్‌ఏలకు సౌకర్యాలు కల్పించాలని, జీవో లేకుండా పని చేయించడం కరెక్ట్ కాదని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల నుంచి తరతరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న రెవెన్యూ డిపార్ట్మెంట్ల వీఆర్‌ఏ సమస్యలతో మగ్గిపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తెలంగాణ తరహాలో వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు, సురేష్, పురుషోత్తం, పున్నారావు, తదితరులు పాల్గొన్నారు.

# 25న ముఖ్యమంత్రి వెలుగొండ పర్యటన

సీఎం కాన్వాయ్ కి అడ్డంకి లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఫీడర్ కెనాల్ వద్ద ముఖ్యమంత్రి భద్రత పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఈ పర్యటన పై మరోసారి జిల్లా ఎస్పీతో తాను పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇన్చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూద్ అలీ, పంచాయతీరాజ్ ఈఈ సుబ్బారెడ్డి, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, మండలంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వెలుగొండ ప్రాజెక్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.ం





# బాపట్ల తీరాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు గోవా పర్యటన

వేటపాలెం ఎంపీడీవో, బీడీవో ఎం రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాజెక్ట్ మేనేజర్లు శివ సరణ్, సాజిత్ షేక్ పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాపట్ల తీరాన్ని సమర్థవంతంగా నిర్వహించే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యం. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బృందం గోవాలోని ప్రధాన బీచ్‌లు, పర్యాటక ప్రాంతాలను సందర్శించి గోవా ప్రభుత్వ, గోవా పర్యాటకశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అదే విధంగా ప్రైవేట్ పెట్టుబడిదారులు, పర్యాటక నిర్వాహకులు, తీర పర్యాటక రంగానికి సంబంధించిన ఇతర భాగస్వాములతో చర్చలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా బీచ్ నిర్వహణ విధానాలు, భద్రతా వ్యవస్థలు, పర్యాటక మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పెట్టుబడి నమూనాలు, విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాల పై దృష్టి సారించనున్నారు. ఈ పర్యటన ద్వారా పొందిన అనుభవాలు, సూచనలు బాపట్ల తీర ప్రాంత అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు దోహదపడనున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇతర పర్యాటక కార్యక్రమాలను బలోపేతం చేయడానికి కూడా ఇవి ఉపయుక్తం కానున్నాయి. జిల్లా ప్రతినిధి బృందం 18వ తేదీ విజయవాడ విమానాశ్రయం నుండి బయలుదేరి ఫిబ్రవరి 22వ తేదీన తిరిగి రానుంది.

# సదరం లేక లబ్ధిదారులు అవస్థలు

లబ్ధిదారులు వచ్చేవారు. కేంద్రానికి జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలతోపాటు ప్రకాశం జిల్లా దర్శి, పల్నాడు జిల్లా వినుకొండ, శ్రీశైలం, ఆత్మకూరు ప్రాంతాలకు చెందినవారు వచ్చేవారు. ప్రస్తుతం కేంద్రాన్ని ఎత్తేయడంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. మార్కా పురం జీజీహెచ్ కేంద్రాన్ని నిలిపివేసి యర్రగొండ పాలెం, గిద్దలూరు, దోర్నాల, కంభం, పొదిలిలోని వైద్యశాలలకు కేటాయించారని లబ్ధిదారులు వాపోతున్నారు. తక్షణమే మార్కా పురం జీజీహెచ్ లో సదరం కేంద్రాన్ని పునరుద్ధరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# విద్యుత్ మీటర్ రీడర్‌ల సమస్యల పై పోరాటానికి సిద్ధం

### ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మరో పోరాటానికి సిద్ధం ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్లో ఏఐటియుసి ఆధ్వర్యంలో బాషా అధ్యక్ష తనసమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏండ్ల తరపడి తక్కువ వేతనం తో 15సంవత్సరాలనుండి సంస్థ ను నమ్ముకొని ఉన్న వారిని కూటమి ప్రభుత్వం పొమ్మన లేక పొగ పెట్టినట్టు గా స్మార్ట్ మీటర్ విధానం తీసుకొచ్చి సంస్థ లో పని చేసే రిడర్ క జీవనోపాధి దెబ్బ తీసారన్నారు, సీనియారిటీ క్వాలిఫికేషన్ బట్టి. సిఫ్ట్ ఆపరేటర్. కంప్యూటర్ ఆపరేటర్లు. వాచ్మెన్లు.వంటి ఉద్యోగాలు ప్రభుత్వ శాఖల్లో అర్హతలను బట్టిఉపాధి కల్పించాలని. యూనియన్ నాయకులతో కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసిరీడర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర నాయకులు శివా రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల దోపిడీ ఆపాలని. ఏ స్ట్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ సబ్ స్టేషన్లలో అర్హతలను బట్టి షిఫ్ట్ ఆపరేటర్లుగా వాచ్మెన్ గా ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బప్పరాజు నారాయణ, సౌజిత్, సిద్దయ్య, రవి, నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# పేద విద్యార్థినికి అండగా పోలీసు

## పరీక్ష ఫీజు కూడా కట్టలేక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థిని ఫీజు చెల్లింపు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు ప్రతినిధి, ఫిబ్రవరి 18)

పోలీసులు కఠినంగా వుండటమే కాదు అవసరం అయితే సేవలో ముందుంటారని చీరాల పోలీసులు నిరూపించారు. వివరాల్లోకి వేళితే బుధవారం చీరాల ఒకటవ పట్టణ పోలీసులకు ఉదయం ఎస్ఓఎస్ కాల్ రాగా, సదరు కాల్ నిమిత్తం చీరాల ఒకటవ పట్టణ పోలీసులు, శక్తి టీం సభ్యుడు, పట్టణంలోని ఉమెన్స్ కాలేజీ దగ్గరకు వెళ్ళగా, సదరు ఉమెన్స్ కాలేజీ నందు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజుకు డబ్బులు కట్టే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతూ కాలేజీ ప్రిన్సిపాల్ తనను ఏదో విధంగా పబ్లిక్ పరీక్షలు రానియ్యమని బాధితురాలు వేడుకుంటున్న సందర్భంలో పరీక్ష ఫీజుకు డబ్బులు కట్టకపోతే పరీక్షలు రానియ్యడం కుదరదని చెప్పారు. ఈ సందర్భంలో విద్యార్థిని పరిస్థితికి చలించిపోయిన చీరాల పట్టణ సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్యలక్ష్మి, హెచ్‌సి రామారావు, శక్తి టీం పిసి కే సుబ్బారావు, పిసి మామిడి కిరణ్ కుమార్, ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శివరాత్రి స్నేహలత కలసి రూ.10వేలు పరీక్ష ఫీజును అందించి పేద విద్యార్థినికి అండగా నిలిచారు. దీంతో పోలీసుల మంచి మనసుకు పలువురు అభినందనలు తేలియాజేసారు.

# పీర్లమాన్యం సచివాలయ పరిధిలో అనుమతులు లేని అక్రమ లేఓట్లు తొలగింపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా అనధికార లేఅవుట్‌లను తొలగించుటలో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని పీర్లమాన్యం సచివాలయ పరిధిలోని అనుమతులు లేని అక్రమ లేఓట్లను పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు కె బాబు రావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ షేక్ రసూల్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, పట్టణ ప్రణాళిక సిబ్బంది బుధవారం అక్రమ లేఅవుట్లు తొలగించారు. పేర్నమిట్ట సచివాలయ పరిధిలోని అనుమతులు లేని అక్రమ లేఅవుట్లలోని హద్దు రాళ్ళను జెసిబి సహాయంతో తొలగించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఓట్లను ఏర్పాటు చేసిన యజమానులు మీ ప్లాట్లను, అనధికారిక లేఓట్లను, బిపిఎస్ స్కీం క్రింద ఏప్రియల్ 23వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకొని క్రమబద్ధీకరించుకోవాలని తెలియజేశారు. అలా రెగ్యులరైజేషన్ చేయించుకోనటువంటి అనధికార లేఅవుట్ ప్లాట్ల తొలగింపు కార్యాక్రమం జరుగుతుందని తెలిపారు.



# రోడ్డు ఆక్రమితను పరిశీలించిన రెవిన్యూ, పోలీసు అధికారులు

(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 18)

కంభం మండల కేంద్రంలోని కందులాపురం కాలనీలోని సర్వే నంబర్ 764లో ఉన్న లింకు రోడ్డును అగ్రకులానికి చెందిన వ్యక్తి నరాల అంకిరెడ్డి ఆక్రమించుకొని రేకుల షెడ్డును నిర్మించుకోవడం జరిగింది. ఈ ఆక్రమణను తొలగించాలని ఇదే కాలనీకి చెందిన అనుముల కొండ రాజు పిజిఆర్ఎస్ ప్రజా సమస్య పరిష్కార వేదికలో అర్జీ ఇవ్వడం జరిగింది. ఇదే రోడ్డును ఆక్రమించిన బిసి కులానికి చెందిన కొందరు మాపై అధికారులకు కంప్లైంట్ ఇస్తావా అని అర్జీ ఇచ్చిన రాజు కుటుంబంపై అతని కుటుంబ సభ్యులపై దాడి చేసి అడ్డువస్తే చంపుతామని బెదిరించడం జరిగింది. ఈ విషయమై బుధవారం స్థానిక మండల తాసిల్దార్ వి కిరణ్ కుమార్, కంభం ఎస్ఐ శివరామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జోషులు, వీఆర్వో, సర్వేయర్ వినయ్‌లు వచ్చి లేఅవుట్లు పరిశీలించి ఈ రోడ్డు ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తామని రేకుల షెడ్డును తొలగిస్తామని కంభం తాసిల్దార్ కిరణ్ అన్నారు. రోడ్డు ఆక్రమించి షెడ్డు వేసిన వారి పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. రాజు కుటుంబ సభ్యులపై భౌతిక దాడి చేసి కులం పేరుతో దూసించి చంపుతామని బెదిరించిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ పరిశీలన లో భాగంగా ఉమ్మడి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కత్తి అన్నోజిరావు, సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్ జిల్లా కార్యదర్శి ఆదిమూలపు అనిల్ రాజ్ లూకా, ఎన్జీవోస్ నంది నాగయ్య, చిట్లూరు ఏలియా, ప్రజాసంఘాల నాయకులు పిఏ ఎఫ్ ఐ ఉపాధ్యక్షులు, కొత్తపల్లి విజయకుమార్, బహుజన పరిరక్షణ సమితి నాయకులు దాసరి యోబు, బహుజన పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు దున్న యోబు, రోడ్డును అక్రమంగా ఆక్రమించిన వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని, రోడ్డుకు అడ్డుగా నిర్మించిన రేకుల షెడ్డును తొలగించి తిరిగి రోడ్డును పునరుద్దరించాలని ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.







# విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిల కోసం 27న ఛలో విజయవాడను జయప్రదం చేయండి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్న విద్యార్థులకు చెల్లించాల్సిన 6,400 కోట్ల రూపాయల ఫీజు బకాయిల్ని విడుదల చేయకపోవటం దుర్మార్గమని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగలం పాదయాత్రలో నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీ ప్రకారం పేద విద్యార్థుల స్కాలర్షిప్లకు పెను శాపంగా ఉన్న జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 27న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.6,400 కోట్ల ఫీజులను పెండింగ్‌లో పెట్టడం వల్ల, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి గురి చేస్తున్నాయన్నారు. డబ్బులు కడితేనే హాల్ టికెట్లు, సర్టిఫికెట్లు ఇస్తామని హుకుం జారీ చేస్తున్నాయని, దీనిని నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. సంక్షేమం, అభివృద్ధి మా రెండు కళ్ళు అంటున్న ప్రభుత్వానికి సంక్షేమ శాఖ విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.2,000 కోట్లు బకాయిలు ఎందుకు ఆపారని ప్రశ్నించారు. మొన్న విడుదల చేసినా రాష్ట్ర బడ్జెట్లో ప్రకాశం జిల్లాకు మొండి చెయ్యి చూపిందన్నారు. ఇప్పటికే మార్కాపురం ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసినప్పటికీ దానికి నిధులు విడుదల చేయలేదన్నారు. త్రిబుల్ ఐటీ, ఆంధ్రకేసరి యూనివర్సిటీలు నిధులు లేక విద్యార్థులు విలవిలలాడుతున్నారన్నారు. తదితర విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 27 జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థులు యువతకు వారు పిలుపునిచ్చారు. ముందుగా ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ రాష్ట్ర నాయకులు చొప్పర సిసింద్రీ బాబు, జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్యామ్, ఒంగోలు నగర అధ్యక్షులు వి కోటి, నగర నాయకులు లోకేష్, రాజు, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 18)

కనిగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం తెల్లవారుజామున మున్సిపల్ కార్మికులు భారీగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ సీఐటీయూ కనిగిరి మండల కన్వీనర్ పి నరేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వారు మాట్లాడుతూ, 12వ పిఆర్సి ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించే విధానం అమలు చేయాలని, అలాగే జీఓఆర్‌టి నెం.1615 ప్రకారం మున్సిపల్ కార్మికులకు పిఆర్సి జీతాలు, డీఏ, ఐఆర్ చెల్లించడంతో పాటు ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు అందజేయాలని కోరారు. అదే విధంగా జీఓ నెం.36 ప్రకారం ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్, ఎం బుక్, డైలీ వేజ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రిటైర్డ్ అయిన, అనారోగ్యం పాలైన, మరణించిన కార్మికుల స్థానాల్లో వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 17 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన ఒప్పందాలకు సంబంధించి జీఓలను తక్షణమే జారీ చేయాలని, పర్మినెంట్ కార్మికులకు డీఏ బకాయిలు, సరండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. నెలకు రూ.24,500 జీతం పొందుతున్న కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని కూడా వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రసాద్, చార్లెష్, ఓబయ్య, శేషయ్య, గరటయ్య, ఎలీషా, ప్రభుదాసు, ఆనంద్, బాలస్వామి, బ్రహ్మయ్య, రమణమ్మ, రోజమ్మ, అచ్చమ్మ, ఈశ్వరమ్మ, గురవమ్మ, తదితరులు పాల్గొన్నారు.




# జీవనోపాధి ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, ఫిబ్రవరి 18)

ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా మహిళలను డిజిటల్, ఆర్థిక నిర్వహణలో నిష్ణాతులుగా మార్చేందుకు ప్రభుత్వం 'ఈ-నారీ' పేరిట బ్యాంక్ లింకేజీ, మొబైల్ యాప్స్, రికార్డుల నిర్వహణ మరియు జీవనోపాధి పెంపుదలపై ప్రత్యేక శిక్షణ అందిసోందని ఎంపికైన మహిళలు గ్రామ స్థాయిలో డ్వాక్రా సంఘాల పారదర్శకతను పెంపోందించాలని ఎపిఎమ్ అనురాధ కోరారు. బుధవారం ఇంకోల్లు మండల వెలుగు కార్యాలయం నందు ఈనారి, సిఆర్‌పిలకు ఎస్‌హెచ్‌జి జీవనోపాధి ప్రణాళిక గురించి ఎపిఎం అధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం అనురాధ మాట్లాడుతూ ఈనారి, సిఆర్‌పిలకు ప్రతి ఒక్క సభ్యురాలికి జీవనోపాదులు గురించి సర్వే చేయడానికి యాప్ ఇవ్వటం జరిగిందన్నారు. దీనిలో ప్రతి ఒక్క సభ్యురాలు వివరాలు నమోదు చేయ్యలని దీనివలన సభ్యురాలికి సంబంధించి జీవనోపాధి ఎంపిక, వారికి తగిన సాంకేతిక మరియు ఆర్థిక సహాయం చేయడానికి దీని ద్వారా సులభతరం అవుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీసీలు వివో ఏలు మరియు సీఆర్పీలు పాల్గొన్నారు.

# చర్మ వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు డాక్టర్ పి ప్రసాద్‌రావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 18)

రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల చర్మ వ్యాధుల డాక్టర్ పి ప్రసాద్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామర, సోయాసిస్, బోల్లి, పేను కొరుకుడు, మోశీగు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు దాదాపు 50 మంది రోగులు వైద్య సేవల కొరకు వస్తున్నారు. కందుకూరు పరిసర ప్రాంతాల నుంచి పిఆర్‌పి కొరకు ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లి ఒక్కొక్కరికి ఐదుసార్లు కలిపి వేలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారని చెప్పారు.

# కొత్తూరు, బీసీ కాలనీ, చింతగుంట్ల వీధుల్లో డ్రైన్స్‌కు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 18)

ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు, కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కొత్తూరు ప్రాంతంలోని బీసీ కాలనీ, చింతగుంట్ల బజార్‌లో రూ.14 లక్షల 90 వేల వ్యయంతో మంజూరైన కొత్త డ్రైన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షులు అచ్చులా రవి, క్లస్టర్ ఇంచార్జీలు బుల్లా బాబు, షేక్ రహ్మాన్, ఒంగోలు పార్లమెంట్ సహాయక కార్యదర్శి షేక్ షరీఫ్, తెలుగుమహిళ నాయకులు కరణం అరుణమ్మ, వార్డు అధ్యక్షులు పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, రామ సుబ్బారెడ్డి, వెన్న శ్రీనివాసులు రెడ్డి, ఏనుగు శ్రీనివాసులు రెడ్డి, గుడిపాటి ఖాదర్, చొప్పరపు తిరుపతయ్య, కుంచం జాకరయ్య, ముకుంద నాయుడు, వార్డు నాయకులు ఉండేలా శ్రీను, రామకృష్ణ, రమేష్, రవి కుమార్, శ్రీను, అల్లూరిరెడ్డి, బాలాజీ, నాగేంద్ర, అలాగే నాయకులు నీలిశెట్టి అంజి నాయుడు, నాగ పాతూరు, షేక్ నిజాముద్దీన్, చిలకపాటి లక్ష్మయ్య, నరేష్ ముత్యాల, డానియల్, జనార్దన్, బ్రహ్మం, కిరణ్, మల్లికార్జున, బాలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

# కత్తితో దాడి - పరిస్థితి విషమం ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు

## వివాహేతర సంబందమేనని ప్రాధమిక సమాచారం కొనకమిట్ల మండలంలో ఘటన

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఫిబ్రవరి 18)

మండలంలోని నాయుడుపేట గ్రామంలో మౌళాలి అనే యువకుడి పై చౌటపల్లె గ్రామానికి చెందిన లాజర్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. గత కొంతకాలంగా మౌలాలికి లాజర్ కుటుంబానికి కొంతమేర వివాదం ఉన్నట్లు తెలుస్తుంది. కత్తి దాడిలో గాయపడిన వ్యక్తిని స్థానిక పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో ప్రాధమిక చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.







## రంజాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 18)

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అద్దంకి నియోజకవర్గ ముస్లిం సోదరుల కోసం "గొట్టిపాటి యూత్" రూపొందించిన ఉపవాస దీక్షల జేబు క్యాలెండర్‌ను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ నెల అందరి జీవితాల్లో శాంతి, సౌహార్దతలు నింపాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. దుల్హన్ పథకం, హజ్ యాత్రలకు రూ. లక్ష చొప్పున సాయం అందిస్తున్నామని, ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తుచేశారు. 4% రిజర్వేషన్ల రక్షణ, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మసూద్, మోతాదు భాషా, ఖాదర్ మస్తాన్, మీరావలి, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా వైద్యం అందించాల్సిన విద్యార్థి మృత్యువాత

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 18)



తండ్రికి చేదోడు వాదోడుగా ఉండి కుటుంబాన్ని ఆదుకోవలసిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. వివరాల్లోకి వెళితే మండలంలోని బద్వీడు చెర్లోపల్లి గ్రామానికి చెందిన బద్వీటి మోహన్ తండ్రి సుబ్రహ్మణ్యం ఇతనికి ఇద్దరు కుమారులు మొదటి కుమారుడు మోహన్ విద్యలో చురుకుగా రానించి మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ ఫ్రీ సీటు రావటంతో విద్య కోసం అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం అనంతపురం జిల్లా గార్లదిన్నె సమీపంలోని ఈతకొలనులో ప్రమాదవశాత్తు మరణించాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు పెద్దారవీడు మండలం బద్వీడు చర్లపల్లి గ్రామానికి చెందిన మోహన్ (19) ఫ్రెండ్స్ 8 మంది సహచర విద్యార్థులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం గార్లదిన్నె కు వచ్చారు. వారితో కలిసి మోహన్ ఈత కొడుతూ లోపలికి వెళ్లారు. ఎంతసేపటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు ఈతకొలనులో వెతకసాగారు. కొలను లోపల ఉండటాన్ని గుర్తించి బయటికి తీసుకొచ్చారు. తలకు గాయం కావడంతో ఆటోలో సమీపంలోనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని సొంత గ్రామం చెర్లోపల్లి కి తరలించారు. తల్లిదండ్రులు, బంధుమిత్రులు గ్రామస్తులు శోక సంద్రోహంలో మునిగిపోయారు.

# కోడూరు వెంకటేశ్వరరావు, పిన్నిక మధుసూదన్ కలిసి సత్కరించిన ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ కార్యవర్గం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

ఒంగోలు నగర కమిషనర్ కోడూరు వెంకటేశ్వరావు, ఒంగోలు తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావుని వారి కార్యాలయాల్లో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ నూతన కార్యవర్గం వేద ఆశీర్వాదాలు అందించి, దుశ్శాలువాతో సత్కరించడం జరిగింది. విధి నిర్వహణలో అనేక వత్తిళ్లతో పాటు పలు సవాళ్ళను ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న వీరికి తగినంత శక్తిని భగవంతుడు ప్రసాదించాలని వారు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలనందించాలని కోరుకుంటున్నామని పరిషత్ అధ్యక్షులు పోతులూరి శివ బ్రహ్మాచార్యులు, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి పాలెపు వెంకటేశ్వరశర్మ, ప్రముఖ పురోహిత బ్రహ్మ కందేపు సుబ్రహ్మణ్యాచార్యులు, చింతలపూడి మణికంఠచార్యులు, నూతలపాటి శివప్రసాదరావు, కొత్తపల్లి సాయిబాబు, మానేపల్లి గోవిందాచార్యులు, తదితరులు పాల్గొన్నారు. సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.





# పార్లమెంట్ అనుబంధ సంఘాలపై టీడీపీ కసరత్తు కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేల భేటీ

## ఫోన్లో మంత్రులతో మాట్లాడిన ఎమ్మెల్యేలు

## సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు ప్రాధాన్యం



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 18)

పార్లమెంట్ అనుబంధ సంఘాల నియామకాలపై తెలుగుదేశం పార్టీ కసరత్తు ప్రారంభించింది. బుధవారం మంగళగిరిలోని కేంద్ర టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ చిరంజీవి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నక్క ఆనంద్ బాబు, బిఎన్ విజయ్ కుమార్, నరేంద్ర వర్మ, ఎంఎం కొండయ్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలగల రాజశేఖర్ బాబు, నక్కల రాఘవలు సమావేశమై విస్తృతంగా చర్చించారు. అలాగే మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమారులతో ఫోన్లో మాట్లాడారు. సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనుభవం, సామర్థ్యం, ప్రాంతీయ సమతుల్యతతో పాటు సామాజిక సమీకరణను పరిగణనలోకి తీసుకోవాలని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతాలకు అనుగుణంగా సామాజిక న్యాయం పాటిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతో పాటు మహిళలకు కూడా తగిన ప్రాధాన్యం కల్పించాలనే అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఈ నెల 22 న తుది జాబితా అందించేలా చర్యలు తీసుకోవాలని జోన్ ఇంచార్జ్ ఎమ్మెల్సీ చిరంజీవి పేర్కొన్నారు.




# వీరేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)

మండలంలోని వీరేపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డీకాల విజయకుమార్ మాట్లాడుతూ పొలం కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేసారు. ఆలా చేసుకున్న రైతులు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మరియు వ్యవసాయ శాఖ ద్వారా అందించు అన్ని సబ్సిడీలు, పంట నష్ట పరిహారం మరియు ఇన్సూరెన్స్ పొందుటకు అవకాశం ఉంటుంది అని తెలియజేసారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కావలసిన రైతులు తమ పొలం పాస్ బుక్, ఆధార్ కార్డు, ఓటీపీ వచ్చు ఫోన్ తీసుకొని మీ గ్రామం లోని వ్యవసాయ సిబ్బందిని కలవాలి అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో శైలజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఈ క్రాప్ పరిశీలించిన జాయింట్ కలెక్టర్

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఫిబ్రవరి 18)

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి బుధవారం చీమకుర్తి మండలంలో పర్యటించారు. చంద్రపాడు గ్రామంలో వేసిన శనగ పంటను ఈ క్రాప్ చేసిన విధానాన్ని పరిశీలించారు. ఈ పంట సూపర్వైజరీ చెక్‌లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమె క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న పొగాకు రైతులతోనూ జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. సాగులో ఎదురవుతున్న సమస్యల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె వెంట వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ బాబు, స్థానిక అధికారులు ఉన్నారు.







# రాళ్లపాడు పై అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే ఇంటూరి

జిల్లా మాజీ సాంస్కృతిక కార్యనిర్వహక కార్యదర్శి మర్రిబోయిన వెంకయ్య



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)

కందుకూరు రాళ్లపాడు రిజర్వాయర్ క్రింద సాగు చేసుకుంటున్న పంటపొలాలు గురించి పల్లె పల్లెకు తిరిగి రైతులు బాధలు తెలుసుకొని, రైతులు బాధ తన బాధగా భావించి అసెంబ్లీలో మా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు తన మృదు వాక్యములతో గళము విప్పి, మాకు ఆ ప్రాజెక్టు వలన ప్రభుత్వం ఏమి చేస్తే మేము పంటలు సాగు చేసుకోవటానికి, త్రాగటానికి ఉపయోగపడునో ఆ విషయాన్ని చెప్పి మంత్రి రామానాయుడుని ఒప్పించి, అన్ని సమస్యలు మీరు చెప్పినట్లే త్వరలో మీ రిజర్వాయర్ విషయం పరిష్కారం చేస్తామని మంత్రి చెప్పడం జరిగింది.

# సజ్జల రామకృష్ణరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి



(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, ఫిబ్రవరి 18)

రాష్ట్ర వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణరెడ్డిని బుధవారం తాడేపల్లిలోని అయన కార్యాలయంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం పార్లమెంట్, కనిగిరి నియోజకవర్గంలోని వైసీపీ పార్టీ పనితీరు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

# ఉయ్యాలలో ఆడుకుంటూ చిన్నారి మృతి

## కన్నీరు, మున్నీరు అయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో కాలనీవాసులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 18)

స్కూల్ కెళ్ళి చదువుకొని ఇంటికి వచ్చి బుడి బుడి అడుగులతో ఇంట్లో అల్లరి చేస్తూ చిన్నచిన్న మాటలతో అమ్మ నాన్నలను చిలిపి చేష్టాలు చేస్తూ నవ్విస్తూ ఆడుకోవాల్సిన వయసులో చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు మార్కాపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం విషాదం చోటుచేసుకుంది చేబ్రోలు జయ కుమార్ తల్లి వెంకటమ్మ కుమార్తె సునంద భాగ్యలక్ష్మి (7) ఇంటి వరండాలో చీరతో కట్టిన ఉయ్యాలలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఉయ్యాలలో రౌండ్ గా తిరిగే క్రమంలో చీర మెడకు చుట్టుకుని ఊపిరాడక అపాస్మారక స్థితిని చేరింది. స్థానికులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.




# పది విద్యార్థుల ఘన వీడ్కోలు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 18)

వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలని, స్కూలుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తిసుకురావాలని ఎంఈఓ2 కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన యాన్యువల్ డే మరియు పది తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు పది పరిక్షలు, తదుపరి భవిష్యత్ కార్యచరణపై ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, కడవకుదురు పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్ర రామారావు, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, మండల విద్యాధికారి కోటేశ్వరరావు, విద్యార్థులకు విలువైన సందేశాలు అందించారు. కార్యక్రమం చివర డ్రాయింగ్ క్రాఫ్ట్, సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.



# టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నవయువ కవి సమ్మేళనం





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 18)

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కందుకూరు నందు బుధవారం విశ్వ సాహితీ కళావేదిక, ఆంధ్రప్రదేశ్, టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు విభాగం ఆధ్వర్యంలో నవయువ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత గజల్ గాయకుడు, రచయిత, మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అందరూ ఉన్నత విలువలు కలిగి ఉండాలని ఉద్బోధించారు. తమ తల్లిదండ్రుల యొక్క కష్టాన్ని అర్థం చేసుకొని, అధ్యాపకుల యొక్క మార్గ నిర్దేశకత్వాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకి చేరుకోవాలని తెలియజేశారు. తమ జీవితంలోని అనేక విశేషాలని తెలియపరుస్తూ, ఉదాహరణల ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఎవరైనా సరే ఒక మనిషి జీవించి ఉన్నప్పుడే మంచి సంబంధాల్ని ఏర్పరచుకోవాలని, ఉన్నత మానవతా విలువల్ని కలిగి ఉండే వారిగా తయారు కావాలని విద్యార్థులను కోరారు. తన యొక్క గజల్స్ తో విద్యార్థుల్ని ఉర్రూతలూగించారు. ఒంగోలుకు చెందిన నెక్స్ట్ జెన్ పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె మురళీధర్ రెడ్డి, శ్రీ కోగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ గారు తమ గురువుగారని, వారి స్ఫూర్తితోనే తాము తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలియజేశారు. త్వరలోనే ఒంగోలులో ప్రపంచ బాలల తెలుగు మహాసభలు నిర్వహిస్తామని, ఆ కార్యక్రమంలో టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు రచించిన కవితలు వినిపించే అవకాశం ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని సమన్వయ పరిచిన విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లి రమావతి తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేయడం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు. తెలుగు భాష అంటే అమ్మ భాషా అని అదే మన ఊపిరి అని తెలిపారు. ప్రముఖ కవి, కళాతపస్వి గంగా శ్రీ డాక్టర్ రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అందరూ కవితల్ని మంచిగా వినిపించారని, అవి ఎంతో సుజనాత్మకంగా ఉన్నాయని తెలియజేశారు. డాక్టర్ రంగిశెట్టి రమేష్ గారు రాసిన కవితల్ని చదివి వినిపించారు. రాష్ట్ర సామాజిక విభాగం అధ్యక్షులు డాక్టర్ బి వి రమణ గారు తమ ప్రసంగం ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్, ఇటువంటి కార్యక్రమం తమ కళాశాలలో జరగటం ఎంతో సంతోష దాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పూనుకున్న తెలుగు విభాగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు 25 మంది తాము రచించిన కవితల్ని వినిపించారు. ఆ కవితలన్నీ కూడా ఒక పుస్తక రూపంలో తీసుకొస్తామని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నిర్వహణ, వ్యాఖ్యాతగా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కే .సుజాత మరియు శ్రీమతి సిహెచ్. అలేఖ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ సాహితీ కళావేదిక నెల్లూరు జిల్లా కార్యవర్గం మరియు సాహిత్య అభిమానులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఏడుకొండల నరేంద్ర, డాక్టర్ పి రాజగోపాల్, డాక్టర్ కె వి పద్మావతి, డాక్టర్ ఐ అనూష, డాక్టర్ ఎన్ తిరుపతి స్వామి, ఇతర అధ్యాపకులందరూ పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో గౌతం కళాశాల విద్యార్థి విజయం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 18)

దేశవ్యాప్తంగా ప్రకటించిన జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష 2026 మొదటి విడత ఫలితాల్లో బద్వేల్ గౌతం జూనియర్ కళాశాల విద్యార్థి సయ్యద్ ఎండి రాశాద్ 89.83శాతం శ్రేణి సాధించి ప్రతిభ చాటాడు. విద్యార్థి విజయంపై కళాశాల ప్రతినిధి శ్రీమతి పి. సౌజన్య లక్ష్మి, ప్రధానాచార్యులు ఎన్. రవికుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థి కృషి ఫలితంగానే ఈ విజయాన్ని సాధించగలిగినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా కళాశాల యాజమాన్యం అభినందించింది.

## ఎస్ఐను కలిసిన జనసేన నాయకులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 18)

పొదిలి ఎస్ఐ గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన సూరెడ్డి రాజేష్‌ను బుధవారం సాయంత్రం మండల జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ హల్చల్ జహీర్, ఎన్ నాగార్జున యాదవ్, షేక్ మదర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రబీ సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉంది

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 18)

బాపట్ల జిల్లాలో రబీ సీజను కు సంబంధించి రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్ కు సంబంధించి నేటి నుండి రాబోయే 21 రోజులకుగాను 7382 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉదన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో 1345 మెట్రిక్ టన్నులు, రైతు సేవ కేంద్రాలలో 705 మెట్రిక్ టన్నులు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలలో 136 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ రిటైల్ వ్యాపారుల దగ్గర 2245 మెట్రిక్ టన్నులు మార్క్ ఫెడ్ గోదాములలో 2718 మెట్రిక్ టన్నులు టోకు వ్యాపారుల దగ్గర 204 మెట్రిక్ టన్నులు కంపెనీ గోదాములలో 29 మెట్రిక్ టన్నుల యూరియా, ఎరువులు రైతాంగానికి అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, 45 కిలోల యూరియా బస్తా ధర రూ.266.50 యూరియాను ధరకు మించి విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకొనబడుతుందని కలెక్టర్ అప్రకటనలో తెలిపారు.



## దోమల నియంత్రణ పై సచివాలయాల వారీగా రివ్యూ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

ఒంగోలు నగరపాలక సంస్థలోని కమీషనరు కోడూరు వెంకటేశ్వరరావు చాంబర్ నందు శానిటరీ ఇన్స్పెక్టర్లకు, వార్డ్ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలకు, శానిటేషన్ పై రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసారు. ఈ మీటింగ్ ప్రభుత్వం నిర్వహించడంపై సచివాలయం వారిగా రివ్యూ నిర్వహించారు. పట్టణములో దోమల నియత్రణ పై తీసుకొను చర్యల పై సూచన చేశారు. దోమల నివారణకు ప్రతి రోజు సాయత్రం 2 నుంచి 5 గంటల వరకు వార్డ్‌లలో చేయటం, డ్రైన్లలో యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయించడం, నిల్వ ఉన్న మురుగు నీటి కుండాలలో ఆయిల్ బాల్స్ ఐతీశీజూ చేయుట, వార్డ్‌లలో సాయత్రం ఫాగ్గింగ్ చేయించడం, ప్రతిరోజు ఉదయం కల్వర్టుల క్రింద ఫాగ్గింగ్ చేయించడం, పోతురాజు కాలువ నల్ల కాలువ వంటి పెద్ద పెద్ద మురుగు నీటి కాలువలపై డ్రోన్‌తో ఏఎల్‌వో చేయించుట వంటి చర్యలు తీసుకొనవలేనని తెలిపారు. పట్టణంలోని అన్ని కాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి ఆ స్థలములను యాజమానులే పరిశుభ్రం చేయించే విధముగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై పేనాల్టీలు విధించాల్సిందిగా, పట్టణంలోని టి, వ్యాపార ప్రాంతాలలో రోడ్ల పై లిటరింగ్ పై పెనాల్టీలు విధించాల్సిందిగా తెలిపారు. పట్టణంలోని వ్యాపారస్తులు అందరూ ఈ నెల అనగా 28వ తేదీ లోపు 100% డీవో ట్రేడ్ లైసెన్స్ ఫీస్‌లు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌వో వి వైష్ణవి, పిచ్చయ్య, బాబ్జి, శ్రీనివాసరావు, 70 సచివాలయాల డబ్ల్యుఎస్ఈఎస్, తదితరులు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com